నవమాసాలు మోసి కన్నబిడ్డను అక్క చేతిలో పెట్టి ఆమె ఎందుకు వెళ్ళిపోయింది?

# కె.లక్ష్మి కథ

# ద్వేషించిన ప్రేమ

ఆరోజు నేనెంతో హేపీగా వున్నాను. కారణం కాలేజీలో డిబేట్‌లో నిర్మలను ఓడించి ఫస్ట్ ప్రైజ్ గెల్చుకున్నందుకు. కాలేజీలో తనని అందరూ ఎంతో ఎడ్మయిరింగ్ గా చూస్తుంటే ఎంత గర్వంగా ఫీలయ్యింది. అదే ఉత్సాహంతో యింట్లోకి వచ్చిన నాకు లోపల గదిలో అక్కయ్య గొంతు వినగానే చెప్ప లేనంత ఉత్సాహం వచ్చింది.

చేతిలోని బుక్స్ గదిలో మంచంలో పడేలా గిరాటేసి చెప్పులు విసురుగా విప్పేసి వంటింట్లోకి పరుగెత్తాను. అమ్మా అక్కయ్య కాఫీ త్రాగుతున్నారు. నేను వెనక్కాలే వెళ్ళి అక్కయ్య కళ్ళు మూసేను.

అక్క నా చేతులు తడిమి ''సుజీ! నువ్వేగా'' — అంది. నేను నవ్వుతూ చేతులు తీసి అక్కయ్య వళ్ళో రాలినట్లుగా ముందు కూర్చున్నాను. ''ఎపుడొచ్చా వక్కా! బావగారూ వచ్చారా'' — అన్నాను. అంటూనే అక్క ముఖంలోకి చూసి చాలా ఆశ్చర్యంగా ''ఏంటలావున్నావ్? వంట్లో బావుండలేదాక్కా? ఏమ్మా అక్క అలా వుందేమిటి?'' — అమ్మ ఆ మాటలు విన్పించుకోనట్లే పనిలో లీనమైంది. అందంగావుండే అక్క ముఖం కళావిహీనంగా వుంది. ఎర్రటి ఛాయ వడిలిపోయి కళ్ళక్రింద నల్లటి చారికలు ఏర్పడ్డాయి. అందవిహీనంగావుంది. ఐనెవ్వర్ సాహర్ సో....

''ఏంటక్కా అలావున్నావ్?'' — అని రెట్టించి అడుగుతున్నా నా వైపు అక్క కాంతి హీనమైన కళ్ళతో'' చాలా రోజులైంది కదా చూసి... అందుకే నీకలా కనిపిస్తున్నానే



మో. ఊ... ఎలా చదువుతున్నావ్ — అక్క టాపిక్ మార్చేప్పటికి నేను సంతోషంతో నా డిబేట్ విషయం చెప్పాను. ఆడవాళ్ళూ — సమస్యలూ అన్న విషయం మీద తను చాలా గొప్పగా వాదించింది. స్త్రీ — చదువు — సమానత్వం.. హక్కులు... స్వాతంత్ర్యం... కట్నాల సమస్య... భార్యా భర్తల మధ్య వుండాల్సిన అవగాహన...

వ్యక్తిత్వం... అలా ఆవేశంగా తను చెప్తుంటే అక్క ముఖంలో భావాలు మారాయి. అమ్మ యిచ్చిన కాఫీ త్రాగుతూ "బావగారు రాలేదాక్కా" — అన్నమాటలకి అక్క మౌనంగా "మీ బావగార్కి శలవు లేక రాలేదు" — అంది. ఎపుడు వచ్చినా గలగలా మాట్లాడే అక్కయ్య ముభావంగా వుండటం నాకు చాలా బాధగా అన్పించింది. నాకు చిన్నప్పట్నుంచీ అక్క అంటే చాలా ఇష్టం. నాలుగేళ్ళ క్రితం పెళ్ళి అయి బావతో హైదరాబాద్ వెళ్ళిపోయిన రోజు అక్కలేని ఈ యింట్లో తను వుండాలంటే ఎంతనరకం అనుభవించిందో తనకే తెల్సు. బావగార్కి హైదరాబాద్‌లో వుద్యోగం. అందమైన అక్క రూపానికి తగ్గట్టే అందమైన బావ.

ఆ రాత్రి చదువుకుంటున్న నా దగ్గరికి వచ్చింది అక్క. "సుజీ! నీతో కాస్సేపు మాట్లాడాలి" — అక్కయ్య నాతో మాట్లాడటానికి అలా పర్మిషన్ అడగటం బాధన్పించింది.

"ఏంటక్కా" — చదువుతున్న బుక్‌ని దూరంగా పెట్టి అక్కవైపు తిరిగాను. అక్క నా ప్రక్కనే కూర్చుంది. "సుజీ వన్నో సమస్య వెంటాడుతుందే.... దానికి పరిష్కారం నువ్వే చెప్పాలి" —

ఐడోంట్ అండర్‌స్టాండ్ ... అక్కవైపు చూశాను. అక్క నా చేయి తన చేతిలోకి తీసుకొని 'సుజీ! నా పెళ్ళి అయి నాల్గు సంవత్సరాలు అయిందికదూ"!

ఆ ప్రసక్తి యిపుడెందు కొచ్చిందా అన్నట్లు చూశాను.

"పిల్లలు పుడితే యిద్దరి బిడ్డలకి తల్లిని అయ్యేదాన్ని. కానీ నాకా అదృష్టంలేదు సుజీ.. డాక్టర్ని కన్సల్ట్ చేస్తే నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదన్నారు. దాంతో అత్తగారు గొడవ పెట్టారు. మీ బావకి యింకో పెళ్ళి చేస్తానన్నారు. అంటమే కాదు ఆవిడ కొడుకుతో వాదానికి దిగారు. మీ బావగారు వప్పుకోలేదు. పిల్లలు లేకపోయినా ఫర్వాలేదన్నారు. నాకు అన్యాయం చేయనన్నారు. దాదాపు రెండునెలల నుంచీ తల్లీ — కొడుకులు గొడవలు పడటం, మాట్లాడుకోకుండా వుండటం చేశారు. చివరికి మా అత్తగారు లాభంలేదనుకొని అన్నం — నీళ్ళు మానుకొని కొడుకు చేత బలవంతంగా వప్పించారు. నాచేత వప్పించారు. సుజీ! ఆడదానికి ఆడదే శత్రువంటారు. ఎంత నిజం! నేనిపుడు ఏంచేయాలి... తెగించి ఆయన్నుంచి దూరంగా వచ్చేయాలి... కానీ నేను రాలేను.. అందుకే ఆలోచించాను... ఎవరో బయటి అమ్మాయి ఆయన జీవితంలోకి ప్రవేశిస్తే నా బ్రతుకు ఎలావుంటుందో ఊహించగలను... ఆవిడ్ని చూసి ఆయన ప్రేమకి నేను దూరం అవుతానన్న భయం నాకు లేదు. కాని ఆయన దూరం అయ్యారన్న భావం నాలో వుండకపోదు... అదే స్వంత మనిషి అయితే... సుజీ మీ బావ దగ్గర నీకు చనువుంది. అందుకే అడుగుతున్నాను. బావని నువ్వు చేసుకో" —

నేనా? — షాక్ తిన్నట్లు అయింది. అక్కవైపు మతిలేని దానిలా చూశాను. ఆ క్షణంలో అక్కంటే పరమ అసహ్యం వేసింది


ఔను నువ్వే సుజీ! నా చెల్లే నా యింటికి

వస్తుంటే నాకే బాధా వుండదు... నీవు పరాయిదానివన్న భావం... ఆయన నాకు దూరం అయ్యారన్న బాధా లేకుండా వుంటుంది. ఏమంటావ్?''

ఒంట్లో రక్తం సలసలా కాగిపోతుంది. అక్కని నేనెంత ప్రేమిస్తానో అంతగా అయిష్టతనీ చూపుతాను. అక్క మొదట్నుంచీ అంతే. తను.. తన సుఖం అనే స్వార్థంతోనే ఆలోచిస్తుంది. ఎదుటి వ్యక్తి తన సొంత చెల్లెలే అయినా సరే... ఎదుటి మనిషి యిష్టాన్ని... వ్యక్తిత్వాన్నీ గుర్తించదు. చిన్నపుడు ఏం తెచ్చినా తనకు నచ్చినవి ముందు తీసుకొని మిగిలినవే తన కిచ్చేది. పెద్ద కూతురని అమ్మ కూడా అక్క యిష్టాన్నే బలపరిచేది. తనకెంత బాధగా అన్పించినా అక్కంటే యిష్టంతో మౌనంగా సర్దుకుపోయేది. అప్పట్నుంచే అక్కంటే ప్రేమ, ద్వేషం రెండూ మనస్సులో యిమిడిపోయినా ద్వేషం ఎపుడూ అట్టడుగు పొరల్లో దాగిపోయే వుండేది.

చిన్నపుడు బొమ్మలూ — దుస్తుల్లా ఈనాడు బావని తను వాడుకొని నాకిస్తుంది . నావల్ల పిల్లలు కావాలట. యిది స్వార్థం కాదా? ఏ అక్కన్నా యిలా అడుగుతుందా? తన చెల్లి జీవితం అందంగా, ఆనందంగా హాయిగా వుండాలని కోరుకుంటుది గాని... యిలా యిలా యింత స్వార్థంగా... అసహ్యంగా అడుగుతుందా? అక్క యింకా తనని చిన్నప్పటి సుజాతే అనుకుంటుందేమొ... తనకి నచ్చినవి తీసుకొని మిగతావి చెల్లెలి కిచ్చినట్లుగా... తను మౌనంగా అందుకునే సుజాతే అనుకుంటుందేమొ. ఐ హేట్ యు....

తను మనిషికాదా? ఏ స్త్రీ అయినా కోరుకొనేది తనకి మాత్రమే స్వంతం అనుకొనే మనిషిని గాని... యిద్దరితో పంచుకొనే వ్యక్తిని కాదు. అలాంటిది అక్క తనని బావని చేసుకోమని ఎంత తేలిగ్గా అనేసింది. నా కళ్ళు ఎర్రగా అగ్ని గోళాలే



అయ్యాయి. ద్వేషం పైకి లేచింది. అక్కవైపు చూడడానిక్కూడా అసహ్యం వేసింది.

గదిలోకి అమ్మ వచ్చింది. అమ్మని చూడగానే అమ్మ అండ నాకు వుంటుందన్న ధైర్యంతో నాలో దుఃఖం పైకి వచ్చింది. చాలా కష్టంగా ఏడ్పుని ఆపుకున్నాను. ఏడ్వటం పిరికి వాళ్ల లక్షణం. నా కది విరుద్ధం.

''అక్క చెప్పే వుంటుంది. ఏ మంటావ్ సుజా'' — అమ్మ అలా అనగానే నేను మరలా మతిపోయిన దానిలా అయిపోయాను . అంటే అమ్మ అక్క యిష్టాన్నే కోరుతుందన్నమాట చిన్నప్పట్లా. ఆ క్షణంలో నేను ఒంటరిగా, నిస్సహాయంగా ఏ సహాయమూ లేనిదానిలా నిశ్శబ్దంగా అయిపోయాను.

సుజాతా! నువ్వు బావని చేసుకోవటంవల్ల అక్క జీవితం చివరివరకూ ప్రశాంతంగా వుంటుంది. బావకేం తక్కువ? చెప్పూ! వయస్సు, అందం చదువు... ''ఆఫీసర్ వుద్యోగం'' — అమ్మ అలా అంటుంటే మొదటిసారిగా అమ్మని ఎదిరించాలన్పించింది.

''అందం హోదా కాదమ్మా కావల్సింది. తన ప్రేమని ఒక్కరికే పరిమితం చేయగల్గే హృదయం వుండాలి. తన ప్రేమ.. తన ఆశలు కోరికలూ... అన్నీ ఒక్కరికే అంకితం కావాలి. దాన్ని మరో వ్యక్తితో పంచుకోవటం కాదు ఆడపిల్ల కోరుకునేది''—

నా మాటలకి అడ్డువస్తూ అక్క ''బావకి నువ్వంటే యిష్టం సుజీ''! — అక్క మాటలు విపరీతమైన కోపాన్నిచ్చాయి. ''బావకి నేనంటే యిష్టం వుండొచ్చు. దాన్లో తప్పేముంది? నీకు చెల్లిని. ఆయనికి భార్య చెల్లెల్ని, మరదల్ని. ఒకవిధంగా కూతురులాంటిదాన్ని. బావ యిష్టాన్ని వ్యక్తించకక్కా... అసహ్యం వేస్తుంది నువ్వంటే'' —

''నా బాధ అర్థంచేసుకో సుజీ! నిన్ను కోరరాని కోరికే కోరుతున్నాను. నన్ను క్షమించు. కానీ నాకు గత్యంతరం లేదు. ఆయన జీవితంలో నువ్వుకాక మరొకరు ప్రవేశిస్తే నీ అక్కని నీవిక చూడలేవు'' — అక్క ఏడుస్తూ గదిలోనికి వెళ్ళిపోయింది.

అమ్మ నా దగ్గరికి వచ్చింది. ''సుజాతా! విజయ పరిస్థితి నువ్వు అర్థం చేసుకోవమ్మా. నువ్వు కాదంటే విజయ బలవంతంగా ప్రాణాలు తీసుకుంటుంది. అక్క లేకపోతే నువ్వు మనశ్శాంతిగా వుండగలవా? నువ్వే ఆలోచించుకో — అమ్మ కూడా వెళ్ళిపోయింది.

నాలో పగా, ద్వేషం పైకి లేచాయి. అట్టడుగు పొరల్లో దాక్కున్న ద్వేషం పడగవిప్పిన త్రాచులా పైకి 'బుస్' మని లేచింది. చిన్నప్పట్నుంచీ నన్నేమాత్రం అర్థంచేసుకోని అక్కమీద ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది. నా బాధ అక్కకి అర్థం అయ్యేలా చేస్తాను. బాధ అంటే ఎలావుంటుందో చూపిస్తాను నేనూ తనలాంటి మనిషినే అని నిరూపిస్తాను. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే జరిగే ప్రక్రియ ఎలావుంటుందో నిరూపిస్తాను. నన్నేమాత్రం అర్థంచేసుకోని అమ్మ అన్నా నాకు అసహ్యంగా వుంది.

ఫైనలియర్ పరీక్షలు అయిపోగానే నేను

బావ జీవితంలోకి ప్రవేశించాను. బావది చాలా అందమైన రూపం.

పెళ్ళిరోజు అక్క నాదగ్గరే వుండి నన్ను స్వయంగా అలంకరించింది. లోలోపల బాధ వుందో లేదో చెప్పలేను గాని పైకి మాత్రం సంతోషంగానే కన్పించింది అక్క. అక్కకి బాధలేదని అనుకోవటం పొరపాటేనేమో... బాధ లేకుండా వుంటుందా? కానీ అక్కకి ఒక విధంగా సంతోషం కల్గటానికి కారణం.. బావని చేసుకొనేది నేను కాబట్టి. బయట అమ్మాయి అయితే తను దూరంగా పిరికిగా, పరాయిదానిలా లోలోపలే దాక్కోవాల్సి వచ్చేది... కానీ తనని చిన్నప్పటి సుజాతలానే ట్రీట్‌చేస్తూ తన చేతుల్లోనే ఆడుకొనే బొమ్మ అనుకుంటుందక్క. నేను బొమ్మని కాను మనస్సున్న మనిషిని అని అక్కని చెంపదెబ్బ కొట్టినట్లు చేసి చూపించాలి.

బావ మాత్రం పీటల మీద చాలా ముభావంగా వున్నాడు. బహుశా తల్లి మూఢత్వానికి బలిపశువులా మనరోసారి పీటల మీద కూర్చున్నందుకు బాధగా వుండి వుంటుంది. అక్కకి అన్యాయం చేస్తున్నానని నా మనస్సు ఘోషిస్తున్నట్లే బావకీ అన్పిస్తుందేమొ. ఆ క్షణంలో బావని తల్చుకుంటే జాలివేసింది. అక్కకి యిద్దరం అన్యాయం చేస్తున్నామని బాధ పడ్తూ వుండగానే బావ నామెళ్ళో మూడు ముళ్ళూ విడదీయని బంధంగా ముడివేశాడు.

పెళ్ళి నాకిష్టం లేకుండానే జరిగిపోయింది. నాలో క్రొత్త పెళ్ళి కూతురికి వుండాల్సిన సంతోషం, సిగ్గు, కోరికలూ ఏమీ లేవు. అసలు నా జీవితాన్ని యింత మోడులా త్రుంచినందుకు అమ్మఅన్నా, అక్కఅన్నా అసహ్యం వేస్తుంది. ఆడదానికి ఆడదే శత్రువు అన్న నానుడి ఎంత నిజం... పెళ్ళి మర్నాడే అక్కతోపాటు హైదరాబాద్ వచ్చేశాను. శలవులకి అక్క దగ్గరకి ఎప్పుడు వచ్చినా నేను వాడుకొనే రూమ్‌లోనే నా సామాన్లు పెట్టుకున్నాను. అక్క అత్తగారు నన్ను చూసి నా తల నిమురుతూ నానుదు



## సమానం

నటి సౌభాగ్యశ్రీని అడిగాడు విలేకరి—

"మీరు మీ మూడో భర్తక్కూడా విడాకులివ్వాలనుకుంటున్నారటగా — నిజమేనా?"

"అవును! నా దృష్టిలో భర్తలందరూ సమానమే! ఏ ఒక్కరివట్లూ విభక్షత చూపడం నాకిష్టంలేదు" గొప్పగా చెప్పింది సౌభాగ్యశ్రీ.

ఎం.రాధాకిషన్ (సికిందరాబాద్)

టిని ముద్దు పెట్టుకుంది. నాకెందుకో ఆవిడ స్పర్శ విపరీతమైన ఏహ్యాభావాన్ని కల్గించింది.

ఈవిడవల్లేగా యిదంతా జరగటం.... అక్క మనస్సుని చిత్రవధచేసి... నా జీవితాన్ని నాశనం చేసింది. ఆవిడతో మాట్లాడాలన్నా ఆవిడ నీడ పడినా భరించలేనట్లుగా అయింది మనస్సు. ఆ రాత్రి ఆవిడ స్వయంగా నాకూ అక్కకి, బావకి దగ్గర వుండి భోజనం వడ్డించింది. ఆవిడ అతి ప్రేమ నామీద చూపించింది. నా కెందుకో ఆవిడ అతిప్రేమ, ఆ యింటి వాతావరణం... ఆ మనుష్యుల్ని చూస్తుంటే వంటరిగా గడపాలని అన్పిస్తుంది. నా గదిలో తలుపులు బిగించుకొని వంటరిగా గడపటం అలవాటు చేసుకున్నాను.

ఆ రోజు భోంచేసి మామూలుగా నా రూంలో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను. అక్క నా దగ్గరికి వచ్చింది.

"సుజా! కార్డ్స్ ఆడదాం రా" — అంటూ నా చెయ్యి పట్టుకొని బావ గదిలోకి లాక్కెళ్ళింది. మరదలుగా బావతో కార్డ్స్ ఆడేదాన్ని, హాస్యంగా మాట్లాడేదాన్ని... కానీ భార్యగా అతని ఎదుటికి వెళ్ళాలంటే నేనే తప్పు చేసినట్లు బిడియంగా అన్పించింది. నాలో నాకే అక్కకి అన్యాయం చేశాను అని బాధపడ్తుంటే అదేం అర్థం చేసుకోని అక్క నన్నలా బావ గదిలోకి బలిపశువులా చెయ్యిపట్టుకొని లాక్కెళ్తుంటే ఒళ్ళు మండింది. అక్కకి బాధలేదా? ఎంత చెల్లెల్ని అయితే మాత్రం భర్త మరో స్త్రీతో గడపటం భరించగలదా? యిదేనా బావమీద అక్కకి ప్రేమ? మూడుముళ్ళ పవిత్ర బంధం? యిదా మన సంప్రదాయం? మనిషికీ, పశువుకీ తేడా ఏముంది యింకా?

నా మనస్సు రోషంతో ఎదురు తిరిగింది పగ పైకి లేచింది. అంతే!!!

అక్క చేయి విసురుగా లాగేసి కార్డ్స్ కలుపుతున్న బావ ప్రక్కనే కుర్చీలో కూర్చొని "నేను రెడీ బావగారూ" — అన్నాను నా మామూలు ధోరణిలో పిలుస్తూ

బావ కళ్ళెత్తి నా వైపు చూశారు.

నా కెందుకో ఆ చూపులు క్రొత్తవిగా అనుభవం లేనివిగా అన్పించాయి. ఒక్కక్షణం బావ వైపుచూసి తల దించుకున్నాను. నాకు తెల్సు బావ నన్నింకా అలానే చూస్తున్నారని. ఆ చూపులకి అర్థం నేనూహించుకో లేకపోయాను. స్వతహాగా నేను అక్కకంటే అందంగా వుంటాను. నా అందంమీద నాకెంతో నమ్మకం. కాలేజీ నాజూకుతనం నా అణువణువులోను నిండుగా వుంది.

"ఓడిపోయిన వాళ్ళకి పనిష్మెంట్ — సినిమాకు తీసుకెళ్ళి హోటల్ కి తీసుకెళ్ళాలి" — అక్క నవ్వుతూ అంది.

నా మనస్సు అర్థంకాని భావనకి గురి అయ్యింది. బావ చూపులతో నా మనస్సు నాలో లేదు. అందుకే ఆట మీద శ్రద్ధ చూపలేకపోయాను. ఓడిపోయాను. నేను ఆట ఆడుతున్నంతసేపు మౌనంగా మాటలు రాని మూగదాన్నే అయ్యాను. బావకూడా ఒకటీ అరా తప్పించి ఎక్కువ మాట్లాడ

లేదు. మా యిద్దరివంతూ అక్కే ఎక్కువ మాట్లాడింది.

"సుజాత ఓడిపోయింది" — బావ నవ్వుతూ అన్నారు. అంటే నేను పిక్చర్‌కి తీసుకెళ్ళాలన్నమాట.

"నాకు యింట్లో చాలాపనుంది. నువ్వూ బావా వెళ్ళిరండి సుజా" — అక్క నావైపు చూస్తూ అంది.

నాకు తెల్సు అక్క అభిప్రాయం. నేను బావతో వంటరిగా గడపాలని. నాకు అక్క మీద అసహ్యం వేసింది. అప్పటి వరకూ మనస్సులో వున్న సిగ్గుని దూరంగా నెట్టేశాను.

"ఓ. కే.... మనిద్దరం వెళ్దాం బావగారూ" — తలెత్తి బావవైపు చూడ కుండానే అన్నాను. బావవైపు చూస్తే నాలో మళ్ళా పిరికితనం వచ్చేస్తుంది.

"పని త్వరగా తెముల్చుకుంటే ముగ్గురం వెళ్ళవచ్చుగా విజయా" — అన్నారు బావ.

అక్క అయిష్టంగా మొహం పెట్టి "నాకు యింట్రెస్ట్ లేదు. మీరిద్దరూ వెళ్ళండీ — అంది.

మామూలుగా నా అలంకరణతోనే సింపుల్‌గా తయారయ్యాను.

'అదేమిటె సుజా మంచి చీర కట్టుకో' — నన్నుచూసి అంటున్న అక్కవైపు చిరాగ్గా చూసి "ఈ శారీ కేం" — అన్నాను. లేత గులాబీ ఆర్గండీ చీరమీద అదే కలర్ బ్లౌజ్. నాకెంతో యిష్టం ఆ చీర.

మొన్నపెళ్ళికి కొన్న చీరల్లో ఏదో ఒకటి కట్టుకో" — అంటున్న అక్కవైపు అయిష్టంగా చూసి "నా కిలానే యిష్టం" — అన్నాను గట్టిగా. నా కోపంచూసి అక్క తగ్గింది. బావతో కల్సి వెళ్తుంటే నేను మాత్రం అక్కమొహంలోకి చూడలేక పోయాను.

యిద్దరం నడుచుకుంటూ వెళ్తున్నాం.

## జోక్

## హిందూవిశ్వవిద్యాలయం

మన దేశ సంస్కృతి ఎంతో ఉన్నతమైనదీ. ముఖ్యంగా హిందూమత ధర్మాచారాలు పాటించే వారు ఎంతో క్రమశిక్షణను కల్గి ఉంటారు! పాశ్చాత్య సాంప్రదాయాలపై మోజు పెంచుకొంటున్న నేటి యువతను మన సంస్కృతి వైపు మరల్చడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఓ బృహత్ పథకాన్ని ప్రారంభించబోతోంది. 'ఆల్ సెయింట్స్ విశ్వవిద్యాలయాన్ని' నెలకొల్పి షిర్డి, పండరీపురం వంటి పుణ్యక్షేత్రాలలో కొన్ని స్కూళ్ళను కూడా ప్రారంభించాలని ఆ ప్రభుత్వ సంకల్పం! క్రమశిక్షణతో కూడిన సమాజాన్ని తీర్చి దిద్దడంలో యువతకు శిక్షణ ఇవ్వటమే ఈ విశ్వవిద్యాలయ ఉద్దేశం! శుభం!

—జూపిటర్

నా కేమీ మాట్లాడాలన్పించటంలేదు. రోడ్డు మీద జనాలని, ఆటోలనీ చూస్తూ పరాగ్గా నడుస్తున్న నాకు ఎదురుగా స్కూటర్ రావటం గమనించలేదు. బావ వేయిపట్టి పక్కకులాగి "ఏమిటి సుజాతా ఆలోచిస్తున్నావూ" — అన్నారు.

నేను నవ్వి "ఏంలేదు" అన్నాను.

"నా గురించే కదూ" — నేను బావ వైపు చూశాను వింతగా. "నా మీద నీకు అసహ్యంగా వుంది కదూ" — నా మనస్సులోని మాటని బావ పైకి చెప్తుంటే నాకు ఏదోలా అన్పించింది. ఒక వ్యక్తిమీద మనకెంత ద్వేషం వున్నా ఆ వ్యక్తి ఎదుటనిల్చి సంజాయిషీ చెప్పుకుంటే మనకే తప్పు చేసిన భావన కల్గుతుంది.

"నీకు అన్యాయం జరిగిందని తెల్సు సుజాతా! కానీ విజయ విస్నే కావాలని ఎందుకు పట్టుబట్టిందో నా కిప్పటికే అర్థం కాలేదు. కానీ.. కానీ... సుజా.. నీకెలా చెప్పాలో తెలియటం లేదు... ఈ రోజుల్లో కూడా అమ్మలాంటి వ్యక్తులు వుంటారంటావా? తన కూతురికే ఇలాంటి పరిస్థితి వస్తే అమ్మ యిలా ప్రవర్తించగలదా? యింకో ఆడపిల్లకి యిలాంటి అన్యాయం వేయగలదా? పెళ్ళిమీద పెళ్ళి ఏమిటీ అనాగరిక చర్య.. తల్చుకుంటే ఎంత అసహ్యంగా వుంది? తల్లిని ద్వేషించటం తప్పేమైనా అమ్మంటే నాకు చాలా ద్వేషంగా వుంది. అమ్మని ఎదిరించలేని

నా పిరికి తనం మీద నాకే అసహ్యంగా వుంది. నా పిరికితనం నీజీవితాన్ని నాశనం చేసింది... కానీ సుజా! నేను నీ కెలాంటి అన్యాయం చేయనని మాటిస్తున్నాను. నాకు తెల్సు ఆడపిల్ల జీవితంలో పెళ్ళి ఒక అందమైన మలుపు అని, ఆ మలుపు పూలపాన్పు కావాలను కుంటుందేగాని ముళ్ళ పాన్పు కాకూడదని కోరుకుంటుంది. కాదంటావా?" —

బావ అలా మనస్సు విప్పి మనస్ఫూర్తిగా అలా నిర్మలంగా మాట్లాడ్తుంటే బావ మీద ద్వేషం, కోపం మంచు మీద వేడి శగలా కరిగిపోయింది. సినిమాని ఏకాగ్రతగా చూడలేక పోయాం యిద్దరమూ. భోజనం కూడా సరిగ్గా చేయలేక పోయాను. మేం యింటికి వచ్చేసరికి అక్క తలుపులు వేసుకొని నిద్రపోతున్నది. ఆ క్షణంలో అక్కని తల్చుకుంటే విపరీతమైన జాలి కల్గింది.

ఆ రోజునుంచి ప్రతిరోజు బావ ఆఫీసునుంచి రాగానే సినిమాకి గాని, మరెక్కడికన్నా వెళ్ళటం అలవాటు అయింది. మొదట్లో అక్క పనుంది రానూ అనటంతో తర్వాత తర్వాత నేను అక్కని నమ్మని పిలవకుండానే బావతో బయటికి వెళ్ళటం అలవాటు చేసుకున్నాను. బావ వచ్చేటైంకి నీట్‌గా తయారయి ఎదురెళ్ళి ఆహ్వానించి కాఫీ అందించే దాన్ని. బావ రెడీ అవగానే యిద్దరం బయటికి వెళ్ళేవారం. వెళ్తూ అక్కని క్రీ కంట గమనిస్తూ వుండేదాన్ని. అక్కముఖంలో మార్పేమన్నా కన్పిస్తుందేమోనని. జీతంరాగానే బావతో కల్సి బజారు వెళ్ళి మంచి ఖరీదైన చీరకొన్నాను. ఇంటికి రాగానే అక్కకు ఆ చీరచూపిస్తూ "నా పుట్టినరోజుకి బావ చీరకొన్నారక్కా" — అని చూపిస్తుంటే

అక్క ముఖంలో క్షణంలో సగం అదోలాంటి మార్పు కన్పించింది. వెంటనే మామూలుగా అయిపోతూ ''చాలా బావుంది'' — అంది ముక్తసరిగా. నా పుట్టిన రోజున బావతో ఆఫీసుకు సెలవుపెట్టించి గండిపేట వెళ్ళాం. కావాలని నాలో ప్రతిమార్పు వస్తున్నది. అక్క వునికినే విస్మరించినట్లు ప్రవర్తించేదాన్ని. బావమీద అధికారం నా ఒక్కదానికే అన్నట్లు బావమీద పెత్తనం చెలాయించే దాన్ని. బావ ప్రతిపనీ నేనే స్వయంగా చేసే దాన్ని. బావకి భోజనం వడ్డించటం.. స్నానంచేసి రాగానే డ్రస్ తీసివ్వటం... ఫైల్స్ సర్దియివ్వటం.. అన్నీ అక్క చేతుల్లోంచి నాచేతుల్లోకి మార్చేసుకున్నాను. నా మార్పు అక్క గమనిస్తున్నది. అక్కలో ఆ మార్పు నేనూ అర్థంచేసుకున్నాను. నాక్కావల్సింది అదే... అందుకే మనస్సు సంతోషంగా అన్పించేది.

బావ ఆఫీసుపని మీద వైజాగ్ వెళ్ళారు.


ఆ రాత్రి అక్క నాగదిలోకి వచ్చింది.

''సుజీ.. నీతోమాట్లాడాలి'' అంది.

నేను నిర్లక్ష్యంగా ''ఇంకానాతో మాట్లాడాల్సినవి ఏం మిగిలాయి.. అన్నాను. కావాలని కర్కశంగా మాట్లాడాను.

అక్క నా ఎదురుగా వున్న కిటికీలోంచి చీకటిని చూస్తూ'' నీవింత అన్యాయంగా ప్రవర్తిస్తావనుకోలేదు. ఆయన జీవితంలోకి పరాయిస్త్రీ వస్తే నేనెలాంటి బాధకి గురిఅవుతానో అని బాధపడే నన్ను సొంత చెల్లెలివై వుండి నన్ను అదే బాధకి గురిచేశావ్'' అక్కబాధ నా కర్థం అయింది. అక్కలో ఈ మార్పే నేను కోరుకుంటున్నది. కానీ పైకి ''నీ మాటలు నాకు ఏం అర్థం కావటంలేదక్కా'' — అన్నాను.

విసురుగా నా కేసి తిరిగింది అక్క ''అర్థం కావటం లేదూ నా బాధ నీకు'' —



అక్క కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి. ఆ కన్నీళ్ళు చూస్తున్నా అక్కమీద నాకు జాలి కల్గలేదు. అలాంటి కన్నీళ్ళే నావి కాదా? బావని చేసుకోమని అర్థంపర్థం లేకుండా అడిగి నాగుండెల్ని ఎలా పిండించింది. ఎన్నికన్నీళ్ళు నాచేత కారిపించింది. బాధ అనేది తనకేగాని నాకు వుండదను కుందా? చెల్లి కాబట్టి తనచేతిలోనే దాక్కుంటుందను కుందా?


''బావమీద నీకే అధికారంవున్నట్లు గానీ ప్రవర్తన... బావని నాకు దూరం చేస్తూన్న నీ చేతలు... సుజా.. బావనీకే కాదు నాకూ భర్తే. నేను అమితంగా ప్రేమించే మనిషని మర్చిపోతున్నావ్'' — అక్క గట్టిగా ఏడ్చేసింది.

నాలో అగ్నిరాజు కొంది. విసురుగా అక్కవైపు తిరిగి ''ఇదంతా నీవు చేసుకుందే కదక్కా. ఏం.. నేను బావని తప్ప మరెవ్వర్ని చేసుకో నన్నానా? అసలు బావని కావాలని నేననలేదే? నీవే నన్ను అడిగావు. బావని చేసుకోకపోతే చస్తావని బెదిరించి నన్ను బలవంతంగా వప్పించావు. అంతేగాని నేను.. నామనస్సు గ్రహించావా? నా యిష్టాన్ని అర్థం చేసుకున్నావా? నాకూ మనసుందని, పెళ్ళి గురించి అందరి ఆడపిల్లల్లా నాకూ మధురమైన కోర్కెలున్నాయని ఆలోచించా వా? చిన్నప్పట్నుంచీ నీ వంతే.. పెద్దదానివి అయినా నీలో మార్పు రాలేదు.. నీ సుఖం కోసం చదరంగంలో పావులా వాడుకున్నావ్. ఇప్పుడు నీవే నీ కన్యాయం చేస్తున్నానని అడగటానికి వచ్చావ్? ఎవరికి ఎవరు చేశారు అన్యాయం... నాకు నువ్వు చేశావా? నీకు నేను చేశానా? ఆలోచించుకో'' — ఆవేశంగా అంటున్న నా వైపు అక్క కొన్ని క్షణాలు అలానే చూసింది. తర్వాత వెంటనే గదిలోనికి వెళ్ళిపోయింది.

ఆరోజు నుంచి అక్కలో నేనూహించని మార్పువచ్చింది. ఇంట్లో అక్కవుందా? లేదా? అన్నంత నిశ్శబ్దంగా ప్రవర్తిస్తుంది. చాలా మౌనంగా వుంటుంది. నవ్వటం మానేసింది. రోజురోజుకీ చిక్కినట్లు కన్పిస్తు ంది. అక్కలో మార్పు నేనాశించిందే అయినా నామనస్సు అక్కనలా చూడలేక పోతున్నది. దీనికంతకీ కారణం అక్క అత్తగారే కదూ! ఆవిడ్ని చంపాలన్నంత కసిగా వుంది. అక్క జీవితం అలాకావటాని కి కారణం ఆవిడే.. ఆవిడే లేకపోతే అక్కకీ పరిస్థితి వచ్చేదా? అక్కమీద కోపం తెచ్చుకుంటున్నానిన్నాళ్ళు.. కానీ అసలు వ్యక్తి అక్క అత్తగారు. అన్న విషయాన్ని మర్చిపోయాను. ఇందులో అక్క తప్పేముం ది? అక్క స్థానంలో నేనున్నా యిలాగే ప్రవర్తించే దాన్నేమో. అత్తగారి అధికారానికి తలవంచి బావని దూరం చేసుకోలేక అక్కపడే మానసిక ఆవేదనకి తోడు నా పిచ్చి ప్రవర్తన అక్కని మరింత కృంగదీసింది . అక్కబాధకి నేనూ కారణం అవుతున్నాను . అక్కని నేను కూడా అర్థంచేసుకో కుండా దూరం చేశాను. అలాంటప్పుడు అక్క మానసిక స్థితి ఎలావుంటుంది? ఏ ఆడపిల్లకీ అక్క లాంటి జీవితం వద్దు. అక్క మానసిక బాధని సరిగ్గా అర్థం చేసుకున్న నాకు అక్కంటే జాలి కల్గింది.

మగవాడు కాబట్టి పైకి బాధలేనట్లు

కన్పిస్తున్నా బావ మానసిక స్థితి కూడా అక్కలానే వుందన్పించింది. ఇద్దరి అమరాగ హృదయాల మధ్య నేను అడ్డం వున్నానన్న బాధ నాకీమధ్య క్రొత్తగా అర్థం అయింది. నా ప్రమేయం ఏమి లేకపోయినా వాళ్ళమధ్య నేను తెరలా వున్నానన్న నిజాన్ని గ్రహించిన నాకు ఆయింట్లో యింకా వుండాలన్పించలేదు. కానీ నాకో ఆశయంవుంది. ఆ ఆశయం నెరవేరేవరకూ నేను అక్కడే వుండాలి. నేను మధ్యలో వెళ్ళిపోతే అక్కకి తేరని అన్యాయం జరుగుతుంది. అక్క పూర్తిగా మౌనిలా అయిపోయింది. బావకూడా దాదాపూ అలానే వుంటున్నారు. అక్కని అంతగా ప్రేమించిన బావ, తల్లి కోసమైనాసరే ఈ నిర్ణయానికి తలవంచాల్సింది కాదు. మానసికంగా బాధకి గురి అయ్యేది వాళ్ళే అయినప్పుడు తల్లిని ఎదిరించినా తప్పులేదు. నిజంగా కొడుకు క్షేమమే ఆలోచించే మనస్సుగలదైతే యిప్పుడు బావ బాధని అర్థంచేసుకొని కృంగిపోవాలి. కానీ ఆవిడకు ఆ ఆలోచనే వున్నట్లు లేదు. నేనెపుడూ ఆవిడ దగ్గరికి వెళ్ళటంగాని, మాట్లాడటం గానీ చేయలేదు. ఆవిడ నాతో మాటలు పెంచుకోవాలని చాలాసార్లు ప్రయత్నించినా నేను దూరంగా వెళ్ళి పోయేదాన్ని. అక్క కూడా ఆవిడతో మాట్లాడటంలేదు. ఆవిడకీ ఏదైనా డబ్బులు అవసరం అయితే కొడుకు గదికివచ్చి అడిగితీసుకెళ్తుంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో వుండలేక ఎపుడు బయటకి వెళ్ళిపోదామా అని నేను ఎదురు చూస్తున్నాను. బావతో సినిమాలు, షికార్లు అన్నీ మానేశాను. బావతోకూడా దూరం దూరంగానే వుంటున్నాను. బావ ఎప్పుడూ అక్కకి దగ్గరగా వుండాలన్నదే నా కోరిక. అక్కభర్తగానే బావరూపం నామనస్సులో ముద్రించిపోయి వుంది. ఆ ముద్ర ఇప్పటికీ అలానే వుంది. నా భర్తగా బావరూపాన్ని నేనెప్పుడూ మనస్సులో నిలుపుకో లేదు. అసలు నాకా ఆలోచనే కంపరంగా, బాధగా వుంటుంది. బావ అక్కభర్త. ముమ్మాటికీ



ప్రిన్సిపాల్

రమణితో అంది లలిత—

"ఏంటే? ఎవరో ప్రబుద్ధుడు నీకు ప్రేమలేఖ రాశాడా? మరెందుకూరుకున్నావ్? ప్రిన్సిపాల్‌కి రిపోర్టివ్వలేకపోయావా?"

"ఆ ప్రబుద్ధుడు మన ప్రిన్సిపాలేనే బాబూ!" వెత్తిబాదుకుంటూ చెప్పింది రమణి.

—ఎం.రాధాకిషన్ (సికిందరాబాద్)

బావ అక్కభర్త. రః నిజం అక్క గ్రహిస్తే ఎంత బావుంటుంది. బావని నేను స్వంతం చేసుకున్నానని అక్క నా మీద అలకసాధిస్తున్నది. నా మనస్సు విప్పి అక్కకి యిప్పట్లో చెప్పను. కానీ నేను చెప్పకపోయినా అక్క నా మనస్సుని అర్థం చేసుకుంటే ఈ సమస్య ఎంతత్వరగా పరిష్కారం అవుతుంది. బావ నా మనస్సుని అర్థంచేసుకున్నారనే నేననుకుంటున్నాను బావ ప్రవర్తనవల్ల. పరాయివాడైన బావనర్థం చేసుకోగల్గితే అక్క ఎందుకు అపార్థంచేసుకుంటుంది? 'ప్లీజ్ అక్కా! నన్నర్థం చేసుకోకపోతే పోనీయ్.. కానీ అపార్థం మాత్రం చేసుకోకు... ఇదేనేను నిన్నుకోరుకొనేది.

అక్క కోరిక ప్రకారం ఓ శుభముహూర్తాన ఓ ప్రవేట్ హాస్పటల్లో ఓ చక్కటి బాబుకి తల్లిని అయ్యాను. బావ తల్లి అందరికంటే ఎక్కువ ఆనందించింది. అక్క ఆనందానికి కూడా హద్దుల్లేవు. చాలారోజుల తర్వాత అక్కముఖంలో నవ్వు చూడగల్గాను. బావ కూడా సంతోషంగానే కన్పించారు.

బాబుకి పేరుపెట్టే రోజు బావ చాలా ఆర్భాటంగానే ఏర్పాట్లుచేశారు. అక్కకి బాబుతోనే లోకం. వాడ్ని ప్రాణం కంటే మిన్నగా చూస్తున్నది. బావకి కూడా బాబంటే అపురూపం.. వాడ్నిక్షణం కూడా వదలకుండా అక్కా—బావా కంటికి రెప్పలా చూస్తున్నారు. పీటలమీద బావ ప్రక్కన కూర్చొని బాబుకి పేరు పెట్టిస్తున్నపుడు అక్కవైపు చూశాను. అక్క ముఖం ఎంతో సంతోషంగా వుంది. అక్క ముఖంలో ఆ సంతోషం నేనిదివరలో ఎపుడూ చూడలేదు నాలో ద్వేషం చచ్చిపోయింది. నేను ఆ యింటికి వచ్చిన పనిపూర్తి అయింది. ఆ యింట్లో నా పని అయిపోయింది. నేను వెళ్ళిపోయే టైం అయిందన్పించింది. నా రాకకు కారణం పూర్తి అయింది.

నా మనస్సు ఒక స్థిరనిశ్చయానికి వచ్చి ఆ రాత్రి అందరూ నిద్రపోయాక బెడ్‌లైట్ వెల్తురులో అక్కకి ఉత్తరం వ్రాయటం ప్రారంభించాను. ఆ ఉత్తరం వ్రాస్తుంటే నా మనస్సు చాలా ప్రశాంతంగా, ఆవేశంగానూ వుంది.

"మైడియర్ అక్కయ్యా".

నేనీ ఇంటికి వచ్చిన పని అయిపోయింది. నన్ను బావని చేసుకోమని ప్రాధేయపడింది వంశోద్ధారకుడికోసమేగా. బాబు పుట్టాక నా బాధ్యత తీర్చినట్లన్పించింది. అందుకే నేను మీ యింట్లోంచి వెళ్ళిపోవాలనుకుంటున్నాను. పెళ్ళి అయిన రోజు నుంచే నేనాయింట్లో ద్వేష భావంతోనే మెలిగాను. ఒక విధంగా ముళ్ళతీగల మీద వున్నట్లే వున్నాను ఇన్ని రోజులూ. ఇప్పుడు బాబుని వదిలి వెళ్ళిపోవటంతో నేనిపుడు ఆ యింటి నుంచి అన్ని బంధాలనీ త్రెంపుకు వెళ్ళిపోయినట్లే. బాబు నా రక్తబంధం... నా పేగు చించుకు పుట్టిన అనుబంధం... బాబుని వదిలి వెళ్ళటం బాధే కానీ భరించలేనిది కాదు. ఎందుకంటే నా కంటే ఎన్నోరెట్లుగా నీవు బాబుని ప్రేమించగలవు. నీ సొంత బిడ్డలా చూడగలవు. అందుకే వాడి గురించి నాకు భయంలేదు. నేను నీ జీవితంలో నుంచి వెళ్ళిపోయే ముందు నా మనస్సుంటుందని... ఆ

మనస్సుని ఏ పరిస్థితిలోనూ చంపుకోలేదని..

అలా చంపుకోవాల్సిన రోజు ఆ మనిషి అనుభవించే బాధ మానవాతీతమని నీవు గ్రహిస్తే సంతోషిస్తాను.

నీవు చిన్నప్పట్నుంచీ స్వార్థంతోనే వుండే దానివి. ఎదుటి మనిషి ఇష్టాయిష్టాన్ని గ్రహించే దానివే కాదు. పెరిగినా నీ స్వభావంలో మార్పురాలేదు. నీలో ఆ మార్పే వచ్చినట్లయితే బావని చేసుకోమని నన్ను నిర్బంధించేదానివి కాదు. నేనింత నరకప్రాయమైన జీవితాన్ని గడిపేదాన్నే కాదు.

బావమీద నాకెలాంటి వ్యామోహమూలేదు. బావని నీభర్తగానే నేను మొదట్నుంచీ భావిస్తున్నాను. నాకు యిప్పటికీ అదేభావం. నిజమక్కా, బావ నీ భర్త. కేవలం నీవక్కదానికే భర్త... నా దృష్టిలో ప్రకాశం బావ... అక్క భర్తగానే గుర్తుంటారు. ఇది నీవు గ్రహిస్తే నాకు చాలా సంతోషంగా వుంటుంది.

'చచ్చిపోతాను'' — అని నీవు అనకపోతే బావజీవితంలోకి నేను ప్రవేశించేదాన్నే కాదు. మీ అత్తగారికి బాగా బుద్ధి చెప్పు.... వంశం నిలవాలంటే సొంత పిల్లలే అక్కర్లేదని... బంధువుల పిల్లల్ని, లేకపోతే 'నా' అనే దిక్కులేని అనాధల్నిచేరతీసినా ఫర్వాలేదని. అంతేగానీ ఒక నిండు జీవితాన్ని నాశనం చేయటం కాదని.... ఆవిడకూ కూతురువుంటే కూతురుస్థితి నీలావుంటే యిదే నిర్ణయానికి వచ్చేదా? కోడలూ కూతురు లాంటిది కాదా! ఇదే నిలదీసి అడుగు? పెళ్ళిగురించి నాకెప్పుడూ ఆలోచనలు లేవు. ఇహముందు కూడా ఏ ఆలోచనలూలేకుండా నన్నిక మొదులా బ్రతకమని శపించినట్లు చేసిన ఆవిడవల్ల నేనెంత నష్టపోయానో యిప్పటికన్నా ఆలోచించమను.

నా గురించి నీవేం బాధ పడకక్కా. నేనీ లోకంలో ధైర్యంగా వంటరిగా బ్రతకగలను.



## మూడువారాలఖర్చు

గల్ఫ్ యుద్ధంలో ఆయుధాలకైన ఖర్చు లెక్కలేనంత! ఇలా వృధా చేయకుండా, మొన్న జరిగిన యుద్ధం మూడు వారాల ఖర్చును మాత్రమే వినియోగిస్తే భూగ్రహం మొత్తంమీద నిరక్షరాస్యులు లేకుండా చేయొచ్చు! అలాగే ఒక్క ఫైటర్ విమానం ఖరీదుతో ఇండియాలో 50వేల గ్రామ డిస్పెన్సరీలను ప్రారంభించవచ్చునట! కానీ— ఇలాటి పిలుకపలుకుల్ని ఎవరు వింటారు చెప్పండి!!

—జూపిటర్

కాలేజీ చదువు నన్ను వ్యక్తిత్వంగల స్త్రీగా, ఒక మనిషిగా తీర్చిదిద్దింది. నీ యింటిని... నీ సొంత మనిషినీ నీకే అప్పగించి వెళ్ళిపోతున్నాను. బాబును జాగ్రత్తగా చూసుకుంటావని నాకు తెల్సు. అందుకే వాడి గురించి నేనేం వ్రాయను. మళ్ళా నేను ఎప్పుడూ నీ కంట పడను. నీ జీవితంలోకి రాను. నా ఎడ్రస్ కూడా నీకు చెప్పను. ఎందుకంటే నేను జీవితం అంతంవరకూ నీకు దూరంగావుండాలని నిశ్చయించుకున్నాను. నీ సుఖాన్నే ఆ కాంక్షిస్తూ 'నీ చెల్లెలు సుజాత''.

కాళ్ళు రైల్వేస్టేషన్‌కి దారితీశాయి.

ప్లాట్‌ఫాం మీదికి అడుగు పెట్టంగానే మైక్‌లో ఎనౌన్స్ విన్పిస్తున్నది.

'యువర్ ఎటన్షన్ ప్లీజ్. ది ట్రైన్ ఫ్రమ్ హైదరాబాద్ టు వైజాగ్ విల్ బి లివింగ్ ఇన్ ఎ ఫ్యూ మినిట్స్'' —

నడకవేగం హెచ్చించాను. కదలిపోతున్న ట్రైన్‌లో సెకెండ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కాలుపెట్టాను.

వెనక్కి తిరిగి చీకటిలో హైదరాబాద్ నగరాన్ని చూస్తూ అనుకున్నాను.

''గుడ్‌బై టూ హైదరాబాద్... ఐ నెవ్వర్ కమ్ టు హైదరాబాద్''.

*

